సాక్షి
కుమురం భీం

ఆదివారం • 8 • జనవరి • 2023



ఖందేవ్ సన్నిధిలో మహాపూజ

నార్నూర్ మండల కేంద్రంలోని ఖందేవ్ ఆలయంలో తొడసం వంశస్తులు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఘనంగా మహాపూజ పూర్తి చేశారు. 10లో



ముగిసిన పోతురాజు, ధర్మరాజు జాతర

కెరమెరి మండలం ఇందాపూర్ సమీపంలో పోతురాజు, ధర్మరాజు జాతర ఉత్సవాలు ముగిశాయి. 'కొలాం' భక్తులు పూజలు నిర్వహించారు. 11లో

గరిష్టం/కనిష్టం
27.3 /11.1

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. కనిష్ట ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. రాత్రి మంచు అధికంగా కురుస్తుంది. చలి తీవ్రత పెరుగుతుంది. ఏజెన్సీలో చలి ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నేడు కంటివెలుగుపై అవగాహన సదస్సు

ఆసిఫాబాద్/ఆసిఫాబాద్‌అర్బన్: రెండో విడత కంటివెలుగు కార్యక్రమంపై జిల్లా కేంద్రంలోని జన్కాపూర్ టాటియాగార్డెన్స్‌లో మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అధ్యక్షతన ఆదివారం మధ్యాహ్నం 1.30గంటలకు అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి ప్రభాకర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. సదస్సుకు జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీడీవోలు, మెడికల్ అధికారులు, మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు, సంబంధిత అధికారులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

పడిపోతున్న కనిష్ట ఉష్ణోగ్రతలు

తిర్యాణి: జిల్లాలో శనివారం ఒక్కసారిగా కనిష్ట ఉష్ణోగ్రతలు పడిపోయి చలితీవ్రత పెరిగింది. ఉదయం పూట విపరీతమైన పొగమంచు కురిసింది. రాష్ట్రంలోనే అత్యల్పంగా సిర్పూర్(యూ)లో 11.5 డిగ్రీలు, రెండో స్థానంలో కెరమెరిలో 11.9 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రానున్న రెండు రోజుల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు మరింత పడిపోయే అవకాశముందని వాతావరణశాఖ అధికారులు చెబుతున్నారు.

ఆలయ హుండీ లెక్కింపు

కెరమెరి: మండలంలోని ఇందాపూర్ గ్రామ సమీపంలోగల పోతురాజు, ధర్మరాజు ఆలయ హుండీని శనివారం ఎంపీపీ పెందోర్ మోతీరాం ఆధ్వర్యంలో వివిధ జిల్లాలకు చెందిన కొలాం ఆదివాసీ భక్తుల మధ్య లెక్కించారు. రెండురోజులకు రూ.36,600 ఆదాయం వచ్చింది. అలాగే ఆవులు, మేకలను భక్తులు కానుకలుగా సమర్పించారు. లెక్కింపులో కటోదాలు సిడాం రాజు, లచ్చు, గంగారాం, ధర్మూ, చిన్నభీము, పాంగురంగ్, పోసిగా తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



ఆసిఫాబాద్‌అర్బన్: మాట్లాడుతున్న జిల్లా జడ్జి

ఆసిఫాబాద్‌అర్బన్: చట్టాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని జిల్లా జడ్జి రవీంద్రశర్మ పేర్కొన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఆదివాసీ భవన్‌లో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎవరైనా లాయర్‌ను పెట్టుకోలేని స్థితిలో ఉంటే వారికి ఉచిత న్యాయ సహకారం కల్పించనున్నట్లు తెలిపారు. జిల్లా న్యాయ సేవా సంస్థ సెక్రటరీ జడ్జి వెంకటేశ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు భోనగిరి సతీశ్‌బాబు, న్యాయవాదులు రాజీవ్‌రెడ్డి, నరహరి, విద్యాసాగర్, వాంకిడి సీఐ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రెబ్బెనలోని రైతువేదికలో..

రెబ్బెన: మండల కేంద్రంలోని రైతువేదికలో శనివారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి మహ్మద్ శరీనా ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పేదలకు న్యాయం దక్కేలా జిల్లా న్యాయాధికార సంస్థ ప్రత్యేక కృషి చేస్తుందని చెప్పారు. లీగల్ ప్యానెల్ అడ్వకేట్ నరహరి, ఏఎస్సై లక్ష్మణ్, రైతులు పాల్గొన్నారు.

'కార్యకర్తలతోనే అధికారం సాధ్యం'



మాట్లాడుతున్న కొత్తపల్లి శ్రీనివాస్

ఆసిఫాబాద్/కాగజ్‌నగర్ టౌన్: బూత్‌స్థాయి కార్యకర్తలతోనే దేశంలో బీజేపీ అధికారంలో ఉందని, మళ్లీ అధికారంలోకి వస్తుందని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ పేర్కొన్నారు. శనివారం హైదరాబాద్ నుంచి కన్వీనర్ వీరభద్రాచారి అధ్యక్షతన నిర్వహించిన వర్చువల్ సమ్మేళనంలో భాగంగా జిల్లా కేంద్రంలోని ఒడ్డెపల్లి గార్డెన్స్, కాగజ్‌నగర్‌లోని పటేల్ గార్డెన్స్‌లో వేర్వేరుగా నిర్వహించిన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పాలక్, మాజీ ఎమ్మెల్యే కాసిపేట లింగయ్య, పార్టీ జిల్లా అధ్యక్షుడు కొత్తపెల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ.. రెండు నియోజకవర్గాల్లో పార్టీ గెలుపునకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా ప్రధాన కార్యదర్శులు కొట్నాక విజయ్‌కుమార్, సేర్ల మురళీధర్, అధికార ప్రతినిధి కేసరి ఆంజనేయులుగౌడ్, పార్లమెంటరీ కో కన్వీనర్ కొలిప్యాక కిరణ్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఆత్మారాంనాయక్, జిల్లా ఉపాధ్యక్షులు చక్రపాణి, బాలకృష్ణ, రాంబాబు, దోని శ్రీశైలం, గణపతి, ముత్తు అశోక్, చాపిడి సత్యనారాయణ, తిరుపతి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కంటివెలుగుకు సన్నద్ధం



- జిల్లాలో 18నుంచి శిబిరాలు ప్రారంభం
- 90 రోజులు కొనసాగనున్న కార్యక్రమం
- 28 బృందాలు.. 28 ఏఆర్ యంత్రాలు
- నేడు జిల్లా కేంద్రంలోని టాటియా గార్డెన్స్‌లో అవగాహన సదస్సు
- హాజరు కానున్న రాష్ట్ర మంత్రి ఐకేరెడ్డి

ఆసిఫాబాద్: రెండో విడత కంటి వెలుగుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. ఇప్పటికే పథకం అమలు తీరుపై రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్, ఇతర మంత్రులతో కలిసి ఈ నెల 4న కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. దీనిపై రాష్ట్ర వ్యాప్తంగా విస్తృత ప్రచారం చేయాలని ఆదేశించారు. ఈ మేరకు జిల్లా అధికార యంత్రాంగం కసరత్తు ప్రారంభించింది. ఈ నెల 18నుంచి చేపట్టే కార్యక్రమాన్ని జిల్లాలో పకడ్బందీగా నిర్వహించేందుకు సమాయత్తమవుతోంది.

నేడు జిల్లా కేంద్రంలో అవగాహన

కంటివెలుగు కార్యక్రమంలో భాగంగా ఆదివారం జిల్లా కేంద్రంలోని టాటియా గార్డెన్స్‌లో అవగాహన సదస్సు నిర్వహించనున్నారు. దీనికి రాష్ట్ర మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి హాజరు కానున్నారు. ఈ నెల 18న కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించే గ్రామాలను ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు ఎంపిక చేస్తున్నారు. రోగులను పరీక్షించిన అనంతరం వివరాలు ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తారు.

జిల్లాలో 28 బృందాలు

కంటివెలుగును పకడ్బందీగా నిర్వహించేందుకు జిల్లా వ్యాప్తంగా 28 బృందాలను నియమించారు. కాగజ్‌నగర్ మున్సిపాలిటీతో పాటు జిల్లాలోని 335 గ్రామ పంచాయతీల్లో కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. తొలివిడత జిల్లాలో 2018 ఆగస్టు 15 నుంచి 2019 జనవరి వరకు కొనసాగింది. దాదాపు ఆరు నెలల పాటు కార్యక్రమం కొనసాగించి అవసరమున్న వారికి కంటి అద్దాలు, మందులు అందించారు. అవసరమైనవారికి శస్త్ర చికిత్సలు నిర్వహించారు. ఈ ఏడాది కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా 5,67,718 మందికి 90 రోజుల పాటు కంటి పరీక్షలు నిర్వహించనున్నారు. జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలతో పాటు కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో వైద్యశిబిరాలు ఏర్పాటు చేయనున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల వృద్ధులు, దివ్యాంగులకు ఈ కార్యక్రమం ఎంతోగానో ఉపయోగపడుతుంది.

సిబ్బందికి శిక్షణ తరగతులు

మంత్రి హరీశ్‌రావు ఆదేశాల మేరకు కలెక్టర్ రాహుల్‌రాజ్ వైద్యారోగ్య శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. జిల్లా వ్యాప్తంగా 28 బృందాలతోపాటు డాటా ఎంట్రీ ఆపరేటర్ల నియామక ప్రక్రియ పూర్తి చేశారు. బాధితులకు కంటి పరీక్షలు నిర్వహించేందుకు 28 ఏఆర్ యంత్రాలు అవసరముండగా, ఇప్పటికే 26 జిల్లాకు చేరుకున్నాయి. మరో రెండింటిని ప్రైవేట్‌గా అద్దెకు తీసుకోనున్నారు. ఇందుకు సంబంధించిన ట్రయల్‌రన్ చేయడంతో పాటు సిబ్బందికి మూడు రోజులుగా శిక్షణ ఇస్తున్నారు.

జిల్లా అంతటా ప్రచారం

కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకునేలా జిల్లాలోని అన్ని మండలాల్లో ప్రచారానికి శ్రీకారం చుట్టారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, మున్సిపల్ చైర్మన్, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, కౌన్సిలర్లు, సర్పంచులతో సమావేశాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. గ్రామస్థాయిలో సర్పంచులు, ఎంపీటీసీలు, మున్సిపల్ స్థాయిలో మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లతో సమావేశాలు నిర్వహించి విస్తృత ప్రచారం చేసేందుకు సన్నద్ధమవుతున్నారు. కంటి వెలుగు శిబిరాలను ఉదయం 9నుంచి సాయంత్రం 4గంటల వరకు నిర్వహిస్తారు. వైద్యనిపుణులతో పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు ఇవ్వనున్నారు. కంటి అద్దాలను నెల రోజుల్లో ఆశ, ఆరోగ్య కార్యకర్తల ద్వారా లబ్ధిదారుల ఇళ్ల వద్దే అందించనున్నారు. కంటివెలుగు శిబిరాల్లో అన్ని రకాల వసతులు కల్పించాలని ప్రభుత్వం ఆదేశించగా ఈ మేరకు అధికారులు జిల్లాలో ఏర్పాట్లు చేస్తున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



ఈ నెల 18న జిల్లాలో కంటి వెలుగు కార్యక్రమం ప్రారంభమవుతుంది. ఇందుకు జిల్లా వ్యాప్తంగా 28 బృందాలను నియమించాం. ఇప్పటికే 26 యంత్రాలు అందుబాటులోకి వచ్చాయి. ఇందుకు సంబంధించిన సిబ్బందికి శిక్షణ ఇస్తున్నాం. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

– ప్రభాకర్‌రెడ్డి, డీఎంహెచ్‌ఓ

రాగి జావతో ఆరోగ్యానికి మేలు



విద్యార్థినులకు రాగి జావ అందిస్తున్న కలెక్టర్

- కలెక్టర్ రాహుల్‌రాజ్

ఆసిఫాబాద్‌రూరల్: రాగి జావతో విద్యార్థులు ఆరోగ్యవంతులుగా ఉంటారని కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని బూర్గుడ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు రాగి జావ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు బలవర్థకమైన ఆహారం అందించాలనే ఉద్దేశంతో మధ్యాహ్న భోజనంతో పాటు రాగి మాల్ట్, బెల్లంతో తయారు చేసిన జావను అందిస్తున్నట్లు తెలిపారు. పౌష్టికాహార లోపంతో ఎదుగుదల తగ్గిన, రక్తహీనతతో ఉన్న విద్యార్థులకు ఇది ఎంతో మేలు చేస్తుందని చెప్పారు. విద్యార్థులకు సత్యసాయి అన్నపూర్ణ ట్రస్ట్ కర్ణాటక వారు సద్గురు మధుసూదన సాయి వారి సౌజన్యంతో ఉచితంగా రాగి జావ అందించడం అభినందనీయమన్నారు. ట్రస్ట్ కార్యదర్శి మాట్లాడుతూ.. రాష్ట్రమంతా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు రాగి జావ పంపిణీ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. జిల్లాలో 750 పాఠశాలల్లోని 42వేల మంది విద్యార్థులకు రాగి జావ అందిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి అశోక్, జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు, ఎంపీపీ మల్లికార్జున్, సర్పంచ్ మాధవి, ఉపసర్పంచ్ కుమార్, ఎంపీటీసీ రమేశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రతీనెల 5న దివ్యాంగుల గ్రీవెన్స్‌డే

ఆసిఫాబాద్: దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి ప్రతీ నెల 5న ప్రత్యేకంగా గ్రీవెన్స్ డే నిర్వహించనున్నట్లు కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. లూయిస్ బ్రెయిలీ జయంతిని పురస్కరించుకొని శనివారం జిల్లా మహిళా, శిశు, వయోవృద్ధులు, దివ్యాంగుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని జన్కాపూర్ రైతువేదికలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయితో కలిసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సదరం సర్టిఫికెట్‌లో ఉన్న అర్హులైన దివ్యాంగులకు పెన్షన్లు అందించనున్నట్లు చెప్పారు. బ్యాంక్ రుణాలు, డబుల్‌బెడ్రూం ఇళ్ల మంజూరు, ఉపాధిహామీ పనుల్లో అవకాశం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. వైకల్యం శాతం తక్కువగా ఉన్న వారికి స్వచ్ఛంద సంస్థలతో కలిసి మెరుగైన వైద్యం అందించనున్నట్లు తెలిపారు. సదరం ప్రకారం జిల్లాలో ఆరువేలకు పైగా దివ్యాంగులకు పింఛన్లు పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. చింతలమానెపల్లి మండలాన్ని సర్వే కోసం ఎంపిక చేసినట్లు చెప్పారు. దివ్యాంగులు తమ సమస్యలపై దరఖాస్తు చేసుకుంటే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని వివరించారు. అర్హులైన దివ్యాంగులకు బస్‌పాస్‌లు, కావలసిన పరికరాలు అందించేందుకు కృషి చేస్తామని ఈ సందర్భంగా కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి సావిత్రి, డీపీఎం యశోద, ఆర్టీసీ అధికారులు, దివ్యాంగులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

సిర్పూర్‌లో అభివృద్ధి శూన్యం

- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్



కాగజ్‌నగర్‌రూరల్: విద్యార్థులతో ముచ్చటిస్తున్న ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్


సిర్పూర్(టి): సిర్పూర్(టి) నియోజకవర్గం అభివృద్ధిలో వెనుకబడిందని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. బహుజన రాజ్యాధికార యాత్ర శనివారం సాయంత్రం సిర్పూర్(టి) మండల కేంద్రానికి చేరింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో మొదటి నియోజకవర్గమైన సిర్పూర్ అభివృద్ధిలో వెనుకంజలో ఉందని విమర్శించారు. గ్రామాల్లో మౌలిక వసతులు విద్య, వైద్యం, రోడ్లు వసతులు లేవన్నారు. స్థానిక ఎమ్మెల్యే ప్రజాసంక్షేమాన్ని గాలికొదిలేశారని ఆరోపించారు. రైల్వే బ్రిడ్జి నిర్మాణం అసంపూర్తిగా ఉందని, బస్టాండ్, మరుగుదొడ్లు లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అనంతరం స్థానిక సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. జెడ్పీ మాజీ చైర్మన్ సిడాం గణపతి, పార్టీ ఇన్‌చార్జి అర్షద్ హుస్సేన్, జిల్లా క్యాదర్శి దుర్గం ప్రవీణ్‌కుమార్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

గాడి తప్పిన విద్యావ్యవస్థ

కాగజ్‌నగర్ రూరల్: బీఆర్‌ఎస్ హయాంలో రాష్ట్రంలో విద్యావ్యవస్థ గాడితప్పిందని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. బహుజన రాజ్యాధికార యాత్రలో భాగంగా శనివారం మండలంలోని బొగుడగూడ, గంగన్నగూడ, జంబుగ, మాలసీతానగర్, సీతానగర్ గ్రామాల్లో పర్యటించారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలల్లోని సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ప్రజాసమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి సిడాం గణపతి, నాయకులు అర్షద్ హుస్సేన్, రాంప్రసాద్, దుర్గం ప్రవీణ్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

మినీస్టేడియం స్థలంలో క్రీడాప్రాంగణం వద్దు

- మొగడ్‌దగడ్‌లో ఆదివాసీల ఆందోళన



ఆందోళన చేస్తున్న ఆదివాసీలు

కౌటాల: మండలంలోని మొగడ్‌దగడ్ గ్రామంలో కుమురంభీం మినీ స్టేడియం ఏర్పాటుకు కేటాయించిన స్థలంలో తెలంగాణ క్రీడా మైదానం ఏర్పాటు చేయవద్దని శనివారం గ్రామంలోని ఆదివాసీలు ఆందోళన చేశారు. గ్రామంలో క్రీడా ప్రాంగణం ఏర్పాటుకు స్థల పరిశీలనకు గ్రామానికి తహసీల్దార్ మునావర్ షరీఫ్ రావడంతో ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 30 ఏళ్ల క్రితం కుమురంభీం మినీ స్టేడియం ఏర్పాటు, ఆదివాసీ భవన నిర్మాణం, ఆదివాసీల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడానికి గ్రామంలో స్థలం కేటాయించారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ స్థలంలో క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేస్తోందని, ఈ స్థలంలో కాకుండా వేరే స్థలంలో దానిని ఏర్పాటు చేయాలన్నారు. కుమురం భీం మినీస్టేడియం స్థలంలో క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేస్తే ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో అనేక ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. తహసీల్దార్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ప్రభుత్వ భూమిని క్రీడాప్రాంగణం ఏర్పాటుకు కేటాయించినట్లు తెలిపారు. అభివృద్ధి పనులను అడ్డుకోవడం సమంజసం కాదని, సమస్యలుంటే ఉన్నతాధికారులకు నివేదించాలని సూచించారు. అభివృద్ధి పనులకు ఆటంకం కల్పిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆదివాసీ నాయకులు ఎర్మ సుధాకర్, తలండే దిలీప్, నైతం విజయ్, గిరిజనులు పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించాలని ధర్నా

కాగజ్‌నగర్ టౌన్: వేతన బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ శనివారం మున్సిపల్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ముంజం ఆనంద్‌కుమార్ మాట్లాడారు. గత నెలలో 30మంది కార్మికులకు ఇంకా వేతనం రాలేదని తెలిపారు. రెండు నెలల వేతన బకాయిలు చెల్లించాలని కోరారు. ఎన్ఎంఆర్ కార్మికులకు కూడా మూడు నెలల వేతనాలు చెల్లించలేదని తెలిపారు. ఈఎస్ఐ, పీఎఫ్ లేకపోవడంతో ఈఎస్ఐ ఆస్పత్రికి వెళ్తే కనీసం మందులు కూడా ఇవ్వడంలేదని వాపోయారు. వెంటనే సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అడిషనల్ కలెక్టర్ చాహత్ బాజ్‌పేయి హామీ ఇవ్వగా ధర్నా విరమించారు. నాయకులు శంకర్, సంజు, శంకరమ్మ, మల్లేశ్, రమేశ్, లక్ష్మి, తిరుపతి, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఒకే రోడ్డు.. నాణ్యత వేరు !

- జాతీయ రహదారి–363 పనుల్లో విచిత్రం
- మంచిర్యాల, ఆసిఫాబాద్ పరిధిలో తేడా
- పనుల్లో అలసత్వం, నిర్మాణంలో నిర్లక్ష్యం



రెబ్బెన పరిధిలో కొనసాగుతున్న రోడ్డు పనులు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: జాతీయ రహదారి నాణ్యత తీరుపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. రాజీవ్ రాహదారిని ఎన్‌హెచ్–363గా అప్‌గ్రేడ్ చేస్తూ శ్రీరాంపూర్ జీఎం ఆఫీసు నుంచి కుమురంభీం జిల్లా వాంకిడి మండలం గోయగాం వరకు రూ.2,497 కోట్లు ఖర్చుతో నిర్మిస్తున్న విషయం తెలిసిందే. మొత్తం 94కిలోమీటర్లలో రెండు విభాగాలుగా చేపట్టగా, రెండు చోట్ల వేర్వేరు కాంట్రాక్టర్లు పనులు చేస్తున్నారు. మొదటి సెక్షన్ 42కిలోమీటర్లు రూ.1356.90కోట్లు, రెండో సెక్షన్‌లో 52కిలోమీటర్లు రూ.1140.50కోట్ల వ్యయంతో పనులు సాగుతున్నాయి. మంచిర్యాల పరిధిలో 80శాతం పనులు పూర్తికాగా, ఆసిఫాబాద్ పరిధిలో పనులు జరుగుతున్నాయి. మొదటి నుంచి ఆసిఫాబాద్ సెక్షన్ పనుల్లో జాప్యం జరిగింది. కాంట్రాక్టర్లతో ఒప్పందం, రద్దు, మళ్లీ వేరే కాంట్రాక్టరుతో ఒప్పందంతో ఆలస్యం జరిగింది. తర్వాత కొన్ని చోట్ల భూ సేకరణ వివాదాలు వచ్చాయి. రెండు చోట్లా పనుల్లో మెటీరియల్ వాడకం, నాణ్యతలోనూ వేర్వేరుగా కనిపిస్తున్నాయి. మంచిర్యాల పరిధితో పోలిస్తే, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా పరిధిలోని రేపల్లెవాడ నుంచి గోయగాం వరకు పనుల్లో నాణ్యతాలోపం కనిపిస్తోంది. కనిపిస్తోంది.

రోడ్డు నాణ్యతలోనూ..

కుమురంభీం జిల్లా మారుమూల ప్రాంతం కావడంతో జాతీయ రహదారి నిర్మాణానికి కంకర, సిమెంట్, మొరం, మట్టి, ఇతర మెటీరియల్ రవాణా ఇబ్బందుల సాకుతో నిబంధనల ఉల్లంఘనలు జరుగుతున్నాయి. గతంలో మట్టిని నిబంధనలకు విరుద్ధంగా తరలించారు. కంకర సైతం ఇదే తీరున తరలిస్తున్నారు. అనుమతుల పేరుతో నిబంధనలు ఉల్లంఘించి తీసుకెళ్తున్నారు. రాత్రింబవళ్లు పని జరుగుతుండడంతో కొన్నిసార్లు పనిలో నాణ్యతాలోపాలు కనిపిస్తున్నాయి. రోడ్డు నిర్మించేటప్పుడు మట్టిపోస్తూ రోలర్‌తో గట్టిగా చేస్తూ, మళ్లీ మట్టిపోస్తూ పలు దఫాలుగా నిర్దేశిత ఎత్తు వచ్చే వరకు చేయాల్సి ఉంటుంది. కొన్నిసార్లు బండరాళ్లను అలాగే వదిలేస్తూ పూడ్చుతున్నారు. నాణ్యత పరిశీలించేందుకు ప్రత్యేకంగా ఇంజినీరింగ్ అధికారులు ఉన్నప్పటికీ కఠినంగా వ్యవహరించకపోవడంతో నిర్మాణ సమయంలోనే లోపాలు బయటపడుతున్నాయి. రోడ్డు నిర్మాణ సమయంలో దుమ్ము ధూళి లేస్తున్నా.. తగినంత నీరు చల్లకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

రోడ్డు మట్టిలో అక్రమాలు

రోడ్డు నిర్మాణంలో తవ్వగా వచ్చిన మట్టిని అక్కడి స్థానిక రైతుల పంట చేన్లలో వేసుకునేందుకు ఒక్కో టిప్పర్‌కు దూరాన్ని బట్టి రూ.800నుంచి రూ.వెయ్యి వరకు వసూలు చేశారు. దాదాపు రూ.నాలుగు కోట్ల వరకు మట్టిని అమ్మేసుకున్నారు. రైతుల నుంచి సేకరించిన భూమితోపాటు పాత రోడ్డునే తవ్వగా వచ్చిన మట్టిని స్థానికులకే విక్రయించారు. భూనిర్వాసితులకు ఉచితంగా ఇవ్వాల్సిన మట్టిని అమ్ముకుని సొమ్ము చేసుకున్నారు.


ఆ సంస్థపై ఉదాసీనత

ఆసిఫాబాద్ సెక్షన్ పరిధిలో పనులు చేసేందుకు మొదట కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రాలేదు. ముందుకు వచ్చి కూడా ఒప్పందం చేసుకుని రద్దయ్యాయి. చివరకు ఇప్పుడు పని చేస్తున్న సంస్థ ముందుకు రాగా, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు అనేక మినహాయింపులు ఇస్తున్నారు. చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడంతోనే పనుల్లో నాణ్యత లోపిస్తోందనే ఆరోపణలు వస్తున్నాయి. కావాల్సిన వనరులు సమకూర్చుకోవడం కోసం నిబంధనలను సైతం పక్కకు పెడుతున్నారు. సాధారణంగా జాతీయ రహదారుల నిర్వహణ బాధ్యత సైతం కాంట్రాక్టరు పరిధిలో ఉండడంతో పనుల్లో రాజీ పడరు. అయితే ఇక్కడ మాత్రం ఆ సంస్థపై ఉదాసీనత, పనులు పూర్తి చేయాలనే ఒత్తిడిలో సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి.



వాంకిడిలో కొనసాగుతున్న రోడ్డు నిర్మాణ పనులు

తృటిలో తప్పిన పెనుప్రమాదం



గోలేటి ఎక్స్‌రోడ్ వద్ద కిందపడిన సిమెంట్ బిల్లలు

రెబ్బెన(ఆసిఫాబాద్): జాతీయ రహదారి నిర్మాణ పనుల్లో మరోసారి నాణ్యత లోపాలు బయటపడ్డాయి. ఈ రోడ్డు వెంట వెళ్తున్న ప్రయాణికులకు తృటిలో పెనుప్రమాదం తప్పింది. రోడ్డు పనుల్లో భాగంగా మండలంలోని గోలేటి ఎక్స్‌రోడ్ వద్ద ఫ్లైఓవర్ బ్రిడ్జి పనులు కొనసాగుతున్నాయి. శనివారం ఉదయం ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం కోసం నిలబెట్టిన సిమెంట్ బిల్లలు ఒక్కసారిగా ఊడి కిందపడ్డాయి. ఆ సమయంలో రోడ్డు వెంట ప్రయాణికులు లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. గతంలోనూ మోతుగూడ వద్ద ఇదే తరహాలో ఫ్లైఓవర్ కోసం ఏర్పాటు చేసిన సిమెంట్ బిల్లలు మీదపడి చిన్నారి మృతి చెందిన విషయం తెలిసిందే. తాజాగా రెబ్బెనలోనూ ఇదే తరహాలో బిల్లలు కిందపడ్డాయి. పనుల్లో నాణ్యత లోపాలపై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విషయం తెలుసుకున్న డీబీఎల్ కంపెనీ సిబ్బంది హుటాహుటిన కిందపడిన బిల్లలను రోడ్డుపై నుంచి తొలగించి యథాస్థానంలో అమర్చారు.

నిర్మాణ పనుల్లో రాజీ లేదు

ఎన్‌హెచ్–363 నిర్మాణ పనుల్లో నాణ్యతలో ఎక్కడా రాజీ లేకుండా నిర్మిస్తున్నాం. ఆసిఫాబాద్ పరిధిలో కొన్ని సంఘటనలు జరిగాయి. నిర్మించేటప్పుడు కొన్ని ఘటనలు అనుకోకుండా జరుగుతాయి. రోడ్డు పనులు అధికారుల పూర్తి పర్యవేక్షణలో సాగుతున్నాయి.

–రవీందర్‌రావు, పీడీ, ఎన్‌హెచ్ఏఐ

క్లుప్తంగా

10న సైన్స్ ఎగ్జిబిషన్

ఉట్నూర్: మండల కేంద్రంలోని కేబీ ప్రాంగణంలో ఉన్న పీఎమ్మార్సీ భవనంలో ఈ నెల 10న ఐటీడీఏ ఆధ్వర్యంలో సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించనున్నట్లు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వరుణ్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆశ్రమ పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఎగ్జిబిషన్ విజయవంతం అయ్యేలా గిరిజన సంక్షేమ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

డిగ్రీ పరీక్షల్లో 15 మంది డిబార్

ఆదిలాబాద్‌టౌన్: కాకతీయ విశ్వవిద్యాలయం డిగ్రీ పరీక్షల్లో భాగంగా శనివారం జరిగిన పరీక్షలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతూ 15 మంది విద్యార్థులు డిబార్ అయినట్లు కేయూ పరీక్షల విభాగం అడిషనల్ కంట్రోలర్ నరేందర్ తెలిపారు. ఉట్నూర్‌లోని పులాజీబాబా డిగ్రీ కళాశాలలో ఒకరు, ఆశ్వీర రేఖా శ్యామ్ డిగ్రీ కళాశాలలో ఆరుగురు, ఉట్నూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నలుగురు, బెల్లంపల్లి భవిత డిగ్రీ కళాశాలలో ఒకరు, భైంసాలోని గోకుల్‌దాస్ పురుషోత్తమదాస్ లడ్డా డిగ్రీ కళాశాల భైంసాలో ఇద్దరు విద్యార్థులు డిబార్ అయినట్లు ఆయన పేర్కొన్నారు.

ఫొటోగ్రఫీలో గోల్డ్‌మెడల్


సర్టిఫికెట్ అందుకుంటున్న అరుణ్

రామకృష్ణాపూర్(చెన్నూర్): సిగ్మా అకాడమీ ఆఫ్ ఫొటోగ్రఫీ ఆధ్వర్యంలో ఈ నెల 5, 6 తేదీలలో రాజమండ్రి, పాపికొండలులో నిర్వహించిన వర్క్‌షాప్‌లో మంచిర్యాల జిల్లా రామకృష్ణాపూర్‌కు చెందిన బండి అరుణ్‌కుమార్ ప్రతిభ కనబర్చాడు. సుమారు 150 మంది ఫొటోగ్రాఫర్లు పాల్గొన్న వర్క్‌షాప్‌లో ల్యాండ్‌స్కేప్ విభాగంలో అరుణ్‌కుమార్ ప్రథమస్థానంలో నిలిచి గోల్డ్‌మెడల్ సాధించాడు. శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అరుణ్‌ను స్థానిక ఫొటోగ్రాఫర్లు అభినందించారు.

జిమ్‌ను అందుబాటులోకి తీసుకురావాలి


వినతిపత్రం ఇస్తున్న యువకులు

రెబ్బెన(ఆసిఫాబాద్): సింగరేణి యాజమాన్యం ఆధ్వర్యంలో గోలేటిలో ఏర్పాటు చేసిన జిమ్‌ను అందుబాటులోకి తీసుకురావాలని యువకులు శనివారం ఏరియా జీఎం దేవేందర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిమ్ వినియోగంలో లేకపోవటంతో వ్యాయామంపై ఆసక్తి ఉన్న యువకులు, విద్యార్థులు మండల కేంద్రంలో ఉన్న జిమ్‌కు వెళ్లాల్సి వస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సురేందర్ రాజు, యువకులు కిషన్‌గౌడ్, మిథున్, శ్రీనివాస్, తుకారాం, తదితరులు పాల్గొన్నారు.

ఆగని భూ ఆక్రమణ


ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమి

- రాత్రికి రాత్రే హద్దులు, ఫెన్సింగ్ ఏర్పాటు
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ భూముల ఆక్రమణ యథేచ్ఛగా సాగుతోంది. అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడంతో విలువైన ప్రభుత్వ భూములు దురాక్రమణకు గురవుతున్నాయి. అక్రమార్కులు రాత్రికి రాత్రే హద్దులు, ఫెన్సింగ్ ఏర్పాటు చేసుకుని దర్జాగా కబ్జాకు పాల్పడుతున్నారు. ఒకవైపు భూకబ్జాల నివారణకు రెవెన్యూ యంత్రాంగం చర్యలు తీసుకుంటున్నా మరోవైపు ఆక్రమణలు ఆగడం లేదు. పది రోజుల క్రితం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వెనకాల ఓ మున్సిపల్ ప్రజా ప్రతినిధి అండదండతో బుధాకలాన్ శివారు సర్వేనంబర్ 170లో ఉన్న రెండెకరాల ప్రభుత్వ భూమి కబ్జాకు గురైన విషయం తెలిసిందే. ఇద్దరు జిల్లా అదనపు కలెక్టర్లు ఆక్రమిత స్థలాన్ని పరిశీలించి కూల్చివేతకు ఆదేశాలు జారీ చేశారు. రెవెన్యూ సిబ్బంది జేసీబీ, ట్రాక్టర్లతో సిమెంట్ స్తంభాలు, ఫెన్సింగ్ కూల్చివేసి చుట్టూ కందకాలు తవ్వించారు. ఆ ఘటన ఇంకా మరువకముందే రైల్వే రడగంబాల బస్తీలోని సర్వేనంబర్ 170లో ఉన్న ప్రభుత్వ భూమిని ఆక్రమించిన ఘటన వెలుగు చూసింది. సదరు ఆక్రమిత భూమిలో ఏడాది క్రితం శాశ్వత కట్టడాలు నిర్మించేందుకు సిద్ధపడగా రెవెన్యూ, మున్సిపల్ అధికారులు వెళ్లి అడ్డుకున్నారు. ప్రస్తుతం అదే స్థలాన్ని ఆక్రమించి ప్లాట్లుగా చేసి స్థిరనివాసాలు ఏర్పాటు చేసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. కబ్జాకు గురైన భూమి కొంతకాలంగా వివాదంలో ఉంది. ఆ భూమిపై రెండువర్గాలు కన్నేసినట్లు తెలుస్తోంది. కొందరు భూఆక్రమణ దారులు పేదలను ముందుంచి తెర వెనుక పావులు కదుపుతున్నట్లు ప్రచారం జరుగుతోంది.

కబ్జాలోనే స్థిర నివాసాలు

రైల్వే రడగంబాల బస్తీలో ఉన్న ఆక్రమిత ప్రభుత్వ భూములను అక్రమార్కులు అమ్మకానికి పెట్టినట్లు ప్రచారం జరుగుతోంది. ఒక్కో ప్లాట్ రూ.4 లక్షల నుంచి రూ.5 లక్షలకు విక్రయిస్తున్నట్లు తెలిసింది. ఇతర ప్రాంతాల్లో కన్నా ధర తక్కువగా ఉండటం, ఇంతకు ముందే ఆ ప్లాట్లను ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూమిలో ఇళ్ల నిర్మాణాలు చేసి ప్రజలు నివాసం ఉంటుండడంతో పట్టా కాకపోయినా లోగుట్టుగా విక్రయాలు చేస్తున్నారు.

ఇళ్ల నిర్మాణాలకు అనధికారిక అనుమతులు

మున్సిపల్ నిబంధనల ప్రకారం ప్రభుత్వ భూమిలో ఇంటి నిర్మాణానికి అనుమతి ఇవ్వడం కుదరదు. కానీ బెల్లంపల్లి మున్సిపాలిటీలో మాత్రం అన్నీ చెల్లుబాటు అవుతాయని పుర ప్రజలు పేర్కొంటున్నారు. నిబంధనల ప్రకారం టీఎస్ బీపాస్ విధానం ద్వారా అనుమతి పొందిన తర్వాత ఇంటిని నిర్మించాల్సి ఉండగా ప్రలోభాలకు ఆకర్షితులై చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. పత్రికల్లో వార్తా కథనాలు వచ్చాక స్పందించినట్లు చేసి కొద్ది మొత్తంగా కూల్చివేయడం.. ఆతర్వాత మళ్లీ నిర్మాణాలు జరిగేలా సహకరించడం జరుగుతోంది. పూర్తిస్థాయి నిర్మాణం జరిగిన తర్వాత ప్రభుత్వ భూమిలో కట్టుకున్న గృహానికి ఇంటినంబర్ కేటాయించి నల్లా కనెక్షన్ ఇచ్చి విద్యుత్ కనెక్షన్ కోసం నో అబ్జక్షన్ సర్టిఫికెట్ ఇస్తున్నారని పురప్రజలు చర్చించుకుంటున్నారు. ఈ వ్యవహారంలో రూ.లక్షలు చేతులు మారుతున్నట్లు సమాచారం. ముందస్తుగా అనధికారిక అనుమతి ఇచ్చి శాశ్వత కట్టడం నిర్మాణం జరిగాక నిబంధల ప్రకారంగా వ్యవహరించడం చేస్తున్నారు. మున్సిపాలిటీలో ప్రాతినిధ్యం వహిస్తున్న కొందరు ప్రజా ప్రతినిధులు అక్రమ దందా సాగిస్తున్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ భూముల కబ్జా, ఆక్రమిత భూముల్లో శాశ్వత కట్టడాల నివారణకు మున్సిపల్, రెవెన్యూ యంత్రాంగం ఏకకాలంలో చర్యలకు పాల్పడాల్సి ఉండగా ఎవరికివారే యమున తీరే అన్న చందంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

అక్రమ నిర్మాణాలు కూల్చేస్తాం



రడగంబాల బస్తీలో ప్రభుత్వ భూమి కబ్జాకు గురైనట్లు సమాచారం అందింది. సిబ్బందిని పంపించి పర్యవేక్షణ చేయించాం. ఒకటి రెండు రోజుల్లో ఆక్రమిత భూముల్లో నిర్మాణాలు కూల్చివేయిస్తాం. ప్రభుత్వ భూముల ఆక్రమణను ఎట్టిపరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదు.

– కుమారస్వామి, తహసీల్దార్, బెల్లంపల్లి

జిల్లాస్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


బహుమతి గెల్చుకున్న విద్యార్థులతో అధ్యాపకులు

బెల్లంపల్లి: కరీంనగర్ జిల్లా కేంద్రంలో ఈ నెల 5, 6 తేదీల్లో నిర్వహించిన జిల్లాస్థాయి పాలిటెక్నిక్ స్పోర్ట్స్ గేమ్స్ మీట్‌లో బెల్లంపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబర్చారు. కబడ్డీ పోటీల్లో ప్రథమ, వాలీబాల్ పోటీల్లో ద్వితీయ బహుమతి సాధించారు. షటిల్ బ్యాడ్మింటన్ డబుల్స్ పోటీల్లోఆశిష్ కృష్ణ, మారుతి, సింగిల్స్‌లో పి.రోహిత్ విజేతలుగా నిలిచారు. 100 మీటర్ల పరుగుపందెంలో ఎస్.కార్తీక్ (ప్రథమ), కె.సాయి కార్తీక్ (ద్వితీయ), 200 మీటర్ల పరుగుపందెంలో కె.సాయి కార్తీక్ (ద్వితీయ), 400 మీటర్ల పరుగుపందెంలో సాయి గౌతమ్ (ప్రథమ), అన్వేష్ (ద్వితీయ), 800 మీటర్ల పరుగుపందెంలో అన్వేష్(తృతీయ), 1500 మీటర్ల పరుగు పందెంలో సాయి గౌతమ్ (ప్రథమ), 4ఇన్‌టూ100 మీటర్ల పోటీల్లో కార్తీక్, సాయి కార్తీక్, జైపాల్, సాయి గౌతమ్ (ప్రథమ) 4ఇన్‌టూ 400 మీటర్ల పోటీల్లో సాయి గౌతమ్, సాయి కార్తీక్, ఎస్.కార్తీక్, హర్షవర్ధన్ (ప్రథమ) షాట్‌పుట్ పోటీల్లో డి.అంజన్ కుమార్ (తృతీయ) జావెలిన్‌త్రోలో సాయి కుమార్ (తృతీయ), హైజంప్ పోటీల్లో సాయి గౌతమ్ (తృతీయ) బహుమతి సాధించారు.

బాలికల విభాగంలో ...

షటిల్ బాడ్మింటన్ పోటీల్లో పి.అశ్విత (ప్రథమ), డిస్కస్ త్రోలో పి.వైష్ణవి (ప్రథమ), 1500 మీటర్ల పరుగుపందెంలో ఆర్.శరణ్య (ద్వితీయ), 4ఇన్‌టూ 400 మీటర్ల పరుగుపందెంలో శరణ్య, శ్రీలక్ష్మి, అక్షయ, రుచిత (ద్వితీయ) 800 మీటర్ల పరుగుపందెంలో శ్రీలక్ష్మి తృతీయ బహుమతి సాధించారు. శనివారం కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులను ప్రిన్సిపాల్ ఎస్.రవీందర్ రెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి


పద్దనపల్లి పాఠశాలలో మన ఊరు–మన బడిని పరిశీలిస్తున్న జాయింట్ డైరెక్టర్ రాజీవ్

మంచిర్యాలఅర్బన్/మంచిర్యాలరూరల్(హాజీపూర్): విద్యార్థులు బాగా చదివి ఉన్నతస్థాయికి ఎదగాలని రాష్ట్ర విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ రాజీవ్ అన్నారు. శనివారం ఆయన మంచిర్యాల జిల్లా ఉన్నత పాఠశాల, హాజీపూర్ మండలం సబ్బెపల్లి, పద్దనపల్లి గ్రామాల్లో మన ఊరు–మన బడి కార్యక్రమంలో భాగంగా చేపట్టిన పనులను పరిశీలించారు. పాఠశాలల్లో విద్యుద్దీకరణ పనులు, తాగునీరు, కిచెన్ షెడ్, టాయిలెట్స్, ప్రహరీ పనులను పర్యవేక్షించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి అభ్యసన నైపుణ్యాలను కలిగి ఉండాలని, ఆ దిశగా అధికారులు, ఉపాధ్యాయులు సంసిద్ధులను చేయాలని తెలిపారు. సబ్బెపల్లి పాఠశాలకు తన సొంత ఖర్చులతో విద్యార్థులకు క్రీడా సామగ్రి సమకూర్చడంతోపాటు మంచినీటి ట్యాంకు ఆధునీకరణ చేయించడం, పాఠశాల పేరుతో కూడిన ఆధునీకరణ బోర్డును ఏర్పాటు చేయించిన స్థానికుడు మాధవరపు వినయ్‌ప్రకాశ్‌రావును అభినందించారు. ఈ కార్యక్రమంలో సెక్టోరల్ అధికారులు చౌదరి, సప్దర్ అలీఖాన్, డీసీఈబీ కార్యదర్శి భీంరావు, పాఠశాల ఉపాధ్యాయులు యోగేశ్వర్, వెంకటేశ్వర్లు, మనోహర్, నాగరాజ్, సునితాదేవి పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి


కరచాలనం చేస్తున్న ప్రేంసాగర్‌రావు

శ్రీరాంపూర్(మంచిర్యాల): యువత క్రీడల్లో రాణించాలని మాజీ ఎమ్మెల్సీ, ఏఐసీసీ సభ్యుడు కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అన్నారు. శనివారం నస్పూర్ ఆర్కే 5 కాలనీలో ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ పోటీలను శ్రీరాంపూర్ ఏరియా జీఎం బి.సంజీవరెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతను ప్రోత్సహించేందుకు ఇలాంటి పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. నస్పూర్ ఆర్‌అండ్‌ఆర్ కాలనీలోని నిర్మిస్తున్న క్రీడా మైదానంలో ఇండోర్ స్టేడియం ఏర్పాటు చేయాలని జీఎంను కోరారు. జీఎం మాట్లాడుతూ క్రీడల అభివృద్ధికి కంపెనీ పరంగా సహాయ సహకారాలు అందిస్తున్నామన్నారు. ఆర్ అండ్‌ఆర్ కాలనీ వద్ద జిల్లాలోనే అతిపెద్ద మైదానంలో ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నస్పూర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బండారి సుధాకర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూదరి తిరుపతి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సుర్మిళ్ల వేణు, నాయకులు శ్రీపతి మల్లేశ్, కృష్ణారావు, భూపతి శ్రీనివాస్, కలవేని శ్యాం, రాజేశ్, నరేశ్, సంపత్‌రెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు ప్రారంభం


పోటీలు ప్రారంభిస్తున్న భాగ్యలక్ష్మి

మందమర్రిరూరల్(చెన్నూర్): మందమర్రి ఏరియాలోని సింగరేణి హైస్కూల్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి 44వ జూనియర్ బాలుర హ్యాండ్‌బాల్ పోటీలను శనివారం జెడ్పీచైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి ప్రారంభించారు. పోటీల్లో ఉమ్మడి పది జిల్లాల నుంచి సుమారు 200 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు శ్యాంసుందర్‌రావు, ప్రధాన కార్యదర్శి కనపర్తి రమేశ్, మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, జీఎం ఆఫీస్ హెచ్‌వోడీ శ్యాంసుందర్ పాల్గొన్నారు.

ముగిసిన ‘ఆగమ’ పరీక్షలు


అర్చకులకు మౌఖిక పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

ఆదిలాబాద్: దేవాదాయ, ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రారంభించిన ఆగమ(అర్చక) పరీక్షలు శనివారం ముగిశాయి. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని తిరుమల తిరుపతి దేవస్థానం ఫంక్షన్ హాల్లో నిర్వహించిన వర, ప్రవర, ప్రవేశ పరీక్షలకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి 237 మంది అర్చకులు హాజరయ్యారు. 40 సంవత్సరాల లోపు వారికి రాత, మౌఖిక పరీక్షలు, ఆపై వారికి మౌఖిక పరీక్షలు నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన వారి వివరాలు ఉన్నతస్థాయి అధికారులకు నివేదించనున్నట్లు దేవాదాయ ధర్మదాయ శాఖ ఉమ్మడి జిల్లా సహాయ కమిషనర్ ఎస్.నవీన్ కుమార్ వెల్లడించారు.

నిర్వాసితులకు పరిహారం అందేలా కృషి


ముంపు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు

భీమిని(బెల్లంపల్లి): కన్నెపల్లి మండలంలోని పీపీ రావు ప్రాజెక్టులో ముంపునకు గురైన భూములను సర్వే చేసి నిర్వాసితులకు పరిహారం అందేలా కృషి చేస్తామని ఇరిగేషన్ డీఈ భద్రయ్య, డీఏ నజీరొద్దీన్ అన్నారు. శనివారం సాలిగాంలోని ముంపునకు గురైన ఇళ్లను పరిశీలించారు. త్వరలోనే సర్వే చేసి భూములు కోల్పోయిన నిర్వాసితులకు పరిహారం అందేందుకు కృషి చేస్తామన్నారు. వారి వెంట ఎంసీ సంతోష్, వర్క్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, ఉప సర్పంచ్ గందం ప్రభాకర్, అధికారులు ఉన్నారు.

ఆకలి కేకల దీక్ష విరమణ


విజయోత్సవ ర్యాలీలో పాల్గొన్న నాయకులు

మందమర్రిరూరల్(చెన్నూర్): తొలగించిన కాంట్రాక్టు కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ టీఎస్టీయూసీ, హెచ్‌ఎంఎస్, ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో ఈ నెల 5న జీఎం కార్యాలయం ఎదుట ‘ఆకలి కేకలు’ నిరాహారదీక్ష చేపట్టారు. స్పందించిన సింగరేణి యాజమాన్యం షార్ట్ టెండర్‌కు శ్రీకారం చుట్టింది. ఈ నెల 11 వరకు దరఖాస్తుల స్వీకరణ, 12న లక్కీ డ్రా తీయనున్నారు. అనంతరం 23 మందిని విధుల్లోకి తీసుకోవడానికి యాజమాన్యం అంగీకరించింది. దీంతో యూనియన్ నాయకులు దీక్ష విరమించారు. బాణాసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. స్వీట్లు పంపిణీ చేసి విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీఎస్టీయూసీ ప్రధాన కార్యదర్శి సంజయ్‌కుమార్, హెచ్‌ఎంఎస్ జిల్లా అధ్యక్షుడు వెల్డి సుదర్శన్, జాఫర్, సంపత్, సమ్మయ్య, షరీఫా, కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు.

పురుగుల అన్నం ఎలా తినేది?

- కౌటాలలో విద్యార్థుల ఆందోళన


ఆందోళన చేస్తున్న విద్యార్థులు

కౌటాల(సిర్పూర్): పురుగుల అన్నం ఎలా తినేదని కౌటాల జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు శనివారం పాఠశాల ఎదుట ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలలో మెను ప్రకారం మధ్యాహ్న భోజనం పెట్టడం లేదని ఆరోపించారు. భోజనంలో పురుగులు, రాళ్లు వస్తున్నాయన్నారు. వారానికి మూడు కోడిగుడ్లు పెట్టాల్సి ఉన్నా ఒక్కటి కూడా పెట్టడంలేదన్నారు. భోజనం నాసిరకంగా ఉండడంతో కొంతమంది ఇంటినుంచి తెచ్చుకుంటుండగా మిగతావారు పస్తులుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విషయాన్ని సదరు ఇన్‌చార్జి ఉపాధ్యాయునికి చెబితే పెట్టింది తినాలని సమాధానం ఇస్తున్నాడన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మెనూ ప్రకారం భోజనం పెట్టాలని డిమాండ్ చేశారు.

అనుమానాస్పదంగా యువతి మృతి

పెంచికల్‌పేట్(సిర్పూర్): మండలంలోని కమ్మర్‌గాం గ్రామానికి చెందిన దుర్గం ధనుబాయి(22) అనుమానాస్పదస్థితిలో మృతి చెందింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం సదరు యువతి శుక్రవారం ఉదయం గ్రామ సమీపంలోని పంట చేనుకు కావలా వెళ్లింది. మధ్యాహ్నం వరకూ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గాలించగా పంటచేనులో మృతదేహం కనిపించింది. స్థానికుల సమాచారంతో ఎస్సై విజయ్‌కుమార్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సిర్పూర్(టి) ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. యువతి తల్లి శకుంతల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఆయన తెలిపారు.

మృతిపై అనుమానాలు

ధనుబాయి మృతి పట్ల తల్లి శకుంతల అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పంట చేనుకు కావలా వెళ్లిన తన కూతురును హత్య చేసి నోట్లో పురుగుల మందు పోసి ఆత్మహత్య చేసుకున్నట్లు చిత్రీకరిస్తున్నారని ఆరోపించారు. భూతగాదాల నేపథ్యంలో హత్య చేశారని నిందితులపై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

బైక్ పైనుంచి పడి వృద్ధురాలు మృతి

బెజ్జూర్(సిర్పూర్): బైక్ పైనుంచి కిందపడి వృద్ధురాలు మృతి చెందినట్లు ఎస్సై వెంకటేశ్ తెలిపారు. మండలంలోని పాపన్నపేట గ్రామానికి చెందిన తొర్రెం మొండక్క(70) శుక్రవారం రాత్రి అదే గ్రామానికి చెందిన కిరణ్ అనే వ్యక్తి ద్విచక్ర వాహనంపై ఎక్కి వెళ్తుండగా బైక్ అదుపు తప్పి కిందపడడంతో వృద్ధురాలికి తీవ్రగాయాలయ్యాయి. కాగజ్‌నగర్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

దహెగాం(సిర్పూర్): మండలంలోని హత్తిని శివారులో శుక్రవారం రాత్రి పేకాట ఆడుతున్న పదిమందిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై సనత్‌కుమార్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు జరిపిన దాడుల్లో రూ.24,800 నగదు, ఐదు బైక్‌లు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. పేకాట ఆడుతున్న జర్పుల కుమార్, ధరావత్ తిరుపతి, సుంకరి శ్రావణ్‌కుమార్, పెద్దల సురేష్, చప్పిడి రవి, కార్నాతం అంజన్న, సోమిశెట్టి విఘ్నేష్, పుప్పాల నవీన్, రెడ్డి శ్రీను, మొర్లె పున్నంలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

ఖండేవ్ సన్నిధిలో మహాపూజ

- వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన తొడసం వంశీయులు
- ప్రత్యేక పూజలు చేసిన జెడ్పీచైర్మన్, ఎమ్మెల్యే


ఖండేవ్‌కు పూజలు చేస్తున్న తొడసం వంశీయులు

నార్నూర్(ఆసిఫాబాద్): పుష్య పౌర్ణమిని పురస్కరించుకుని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన తొడసం వంశీయులు వారి ఆచారం, సంస్కృతి, సంప్రదాయం ప్రకారం శుక్రవారం రాత్రి ఖండేవునికి ప్రత్యేక పూజలు ప్రారంభించారు. శనివారం ఆలయ ప్రాంగణంలో భేటీ అయ్యారు. ఒకరికొకరు సాధకబాధకాలు తెలుసుకున్నారు. ఆలయ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. మహారాష్ట్రలోని చంద్రపూర్ జిల్లా జివితి తాలూకాలోని కొద్దిగూడ గ్రామానికి చెందిన తొడసం ఆడపడుచు మెస్రం నాగుబాయి చందు దేవుని సన్నిధిలో రెండున్నర కిలోల నువ్వుల నూనె తాగింది. సంప్రదాయం ప్రకారం మహాపూజ పూర్తి చేశారు. 15 రోజుల పాటు జాతర ఉత్సవాలు కొనసాగుతాయి. మహాపూజకు జెడ్పీచైర్మన్ రాథోడ్ జనార్దన్, ఎమ్మెల్యే ఆత్రం సక్కు, ఐటీడీఏ పాలక మండలి చైర్మన్ కనక లక్కేరావుకు తొడసం వంశీయులు సంప్రదాయం ప్రకారం తలపాగచుట్టి స్వాగతం పలికారు. అనంతరం ఖండేవునికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రజాదర్బార్‌లో జెడ్పీచైర్మన్, ఎమ్మెల్యే మాట్లాడుతూ తరతరాలుగా వస్తున్న సంస్కృతి, సంప్రదాయాలు కాపాడాల్సిన బాధ్యత ఈతరం యువతపై ఉందన్నారు. ఆదివాసీ ఆలయాల అభివృద్ధికోసం ప్రత్యేక నిధుల కోసం ప్రయత్నం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కనక మోతుబాయి, గ్రీన్ ఇండియా డైరెక్టర్ బాదావత్ పూర్ణచందర్, సర్పంచ్ బానోత్ గజానంద్ నాయక్, వైస్ ఎంపీపీ చంద్రశేఖర్, ఆలయ కమిటీ చైర్మన్ మెస్రం రూప్‌దేవ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తొడసం నాగోరావు, పీఏసీఎస్ చైర్మన్ ఆడే సురేశ్, ఎంపీటీసీ పరమేశ్వర్, తుడుందెబ్బ మండల అధ్యక్షుడు కనక ప్రభాకర్, కార్యదర్శి మెస్రం మానిక్‌రావు, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు ఉర్వేత రూప్‌దేవ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు రాథోడ్ గణేశ్, తదితరులు పాల్గొన్నారు.


మొక్కుతున్న జెడ్పీచైర్మన్ రాథోడ్ జనార్దన్


సంప్రదాయబద్ధంగా పలకరిస్తున్న మహిళలు


ఇంటింటా నూనె సేకరిస్తున్న ఆదివాసీ మహిళలు